# కర్త-కర్మ-క్రియ

మళ్లీ టైం చూసుకున్నాడు మధుసూదనం. ఆరూ పదిహేనైంది.

ముసలివాడి శౌర్యంలా సాయంసూర్యుని ప్రతిభ కూడా తగ్గి, కిరణాలు చిన్నబోతున్నై.

'గమ్యాన్ని బారెడు దూరంలో వుంచుకుని గూడా ఆ దూరాన్ని అధిగమించటానికి అంత జాప్యం చేస్తాడెందుకో ఈ ముసలి సూరన్న' అనుకున్నాడు మధుసూదనం.

వీధి చివరకి చూస్తున్నవాడల్లా వెనుదిరిగి ఇంటివైపు చూశాడు. గడియ పెట్టబడిన తలుపుకు తాళం వేలాడుతోంది. వరండా వరకూ వెళ్ళి కిటికీలో నుంచి లోపలికి చూశాడు. టేబులు మీద పుస్తకాల సంచీ లేదు. వెంటనే వెనక్కి తిరిగేడు. ఇంటి ముందు పచార్లు చేయసాగేడు.

ఉమ యింకా ఎందుకు యింటికి చేరుకోలేదో అతనికి అర్థం కాలేదు. అతనికెందుకో భయంభయంగా వుంది. మనసులోని దిగులు మరి కొంచెం లావైంది.

తను ఎన్నోసార్లు చెప్పాడు. స్కూలు మూసేయగానే ఇంటికి చేరుకోమని. ఉమ మాట్లాడదు. నవ్వుతుంది. అందంగా,

తీయగా, చిలిపిగా నవ్వుతుంది. 'తల్లి పోలిక' అనిపిస్తుంది.

'ఆ నవ్వులోనూ, రూపంలోనూ మాత్రమే.' అని సవరించు కున్నాడు. అంతకు మించి ఉమ తల్లిని పోలటం అతనికిష్టం లేదు.

ఉమ స్కూలు నుంచి రావడం క్షణం ఆలశ్యమైతే చాలు, మనసుకు పిచ్చెత్తినట్లుగా వుంటుంది. ఎందుకో అతనికి అర్థం కాదు. కాని, కారణం కనిపెట్టాలని ఆలోచిస్తే మాత్రం అతని కనిపిస్తుంది. దీనికంతటికీ కారణం సరోజ అని.

మధుసూదనానికి మొహం ఎర్రబడింది. సరోజ జ్ఞాపకం వచ్చి ఆమె మీది కోపంతో వుడికిపోయాడు.

"నాన్నా! నాన్నా!!" మధుసూదనం తేరుకున్నాడు. ఎదురుగా కూతురు. అరగంట నుంచి తను ఎదురు చూసిన ఉమ.

"వచ్చావా ఉమా! ఇవాళ యింత ఆలశ్యం చేశావేం తల్లీ!" ఉమను దగ్గరకు తీసుకుని ఆమె వీపును చేత్తో నిమిరాడు ఆప్యాయంగా.

ఉమ మాట్లాడలేదు. తండ్రి తననలా దగ్గరకు తీసుకున్నప్పు డెందుకో పరాకుగా వుండిపోతుంది. బహుశ తల్లి జ్ఞాపకం వస్తుందేమో.

ఉమ మాట్లాడకుండా సంచీలోని తాళంచెవిని వెదికి తండ్రి చేతికిచ్చింది. మధుసూదనం తాళం తీసి లోపలికి నడిచాడు — ఉమ భుజం మీద చేయివేసి-నడిపిస్తూ.

* * *

పొద్దుట నుంచి తలుపులు మూసి వుంచటంవల్ల గాబోలు ఇంట్లోకి అడుగు పెట్టగానే వెచ్చని ఆవిరి కొట్టింది మధుసూదనానికి. 'గుంయ్' మంటూ-ఈగల్లాంటి దోమలు, అతని మొహం ముందుకు

వచ్చి స్వాగతం పలికాయి. ఇంట్లో నుంచి మాగుడు వాసన వచ్చి అతన్ని చుట్టివేసింది. మధుసూదనం లైటు వేశాడు. గదంతా వెల్తురుతో నిండిపోయింది. గదిలో సామానంతా చిందరవందరగా వుంది. నడిస్తే కాళ్ళ క్రింద యిసుక గరగర మంటోంది. మధుసూదనం గట్టిగా నిట్టూర్చాడు.

ఉమ తండ్రివైపు చూసింది. మధుసూదనం యింకా యింటి పరిస్థితిని పరికిస్తూనే వున్నాడు. ఉమ పుస్తకాల సంచీని టేబులు మీద పెట్టి క్రిందపడివున్న పుస్తకాల్ని, గ్లాసుల్ని తీసి ఎక్కడి వాటి నక్కడ పొందికగా అమర్చింది. చీపురు తీసుకుని గదినంతా శుభ్రం చేసింది. మధుసూదనం అప్పటికి ఊపిరి పీల్చుకోగలిగేడు.

తండ్రి ముఖం ప్రసన్నం కావటం ఉమకు కొండంత సంతోషాన్ని కలిగించింది. నోరు విప్పి మాట్లాడటానికి కొంచెం ధైర్యం వచ్చింది.

"ఇవాళెందుకో సీత రాలేదు నాన్నా" అంది.

"రేపురానీ చెప్తా. మాన్పించి వేస్తాను. తిక్క కుదుర్తుంది."

తండ్రి మాటలకి ఉమ బిక్క మొహం వేసింది. అది చూసి మధుసూదనం "పోనీలేమ్మా, దిగులెందుకు. మరో పనిమనిషి దొరక్క పోతుందామనకు. లేకపోతే.... చెప్పాపెట్టకుండా పనికి రావడం మానేస్తుందీ! ఇబ్బంది పడిపోతామని తెలీదూ?" అన్నాడు.

"ఏదో ఇబ్బంది వల్లనే రాకపోయుంటుంది నాన్నా" అనేసి అక్కణ్నుంచి వెళ్ళిపోయింది ఉమ.

మధుసూదనానికి తెలుసు. ఉమకు సీత అంటే ప్రాణమని. సీతను పనిమనిషిగా కాకుండా ఒక ఆత్మీయురాలిగా ఉమ భావిస్తుంది. సీతగూడా ఉమని అప్యాయంగా చూసుకుంటూ యింటి పనిమనిషిగా

కాకుండా ఇంట్లోని ఒక వ్యక్తిగా మసలుతుంది; పదేళ్ళు నిండని ఉమను యజమానురాలిగానూ గౌరవిస్తుంది; స్నేహితురాలిగానూ సహాయం చేస్తూ అండగా వుంటుంది. శ్రేయోభిలాషిగా సలహాలిచ్చే సీతలో ఉమ తల్లి రూపం చూస్తుంది. మధుసూదనానికి తెలుసు వాళ్ళ అనుబంధం. వారిద్దరూ అలా దగ్గరగా వుండటం తమ అంతస్థుకు గౌరవహీనమని అప్పుడప్పుడూ అనుకున్నా, వారి అనుబంధాన్ని అతనెన్నడూ విడదీయాలనుకోలేదు. అలా అనుకోక పోవడంలో అతని స్వార్థం లేకపోలేదు. పసితనమనే తెల్లని మేలి ముసుగులో నుంచి ప్రపంచాన్ని చూసి అర్థం చేసుకోదగిన విషయా లెన్నో తల్లిదగ్గర నేర్చుకోవలసిన వయసు ఉమది. తల్లి కాకపోతే తల్లిలాంటి మరో తల్లి దగ్గర ఆమెకా అవకాశం లభించింది కదా అని సమాధానపడేవాడు మధుసూదనం.

అలా తను సమాధానపడినా అప్పుడప్పుడూ ఉమ తల్లిని తలపోస్తున్నట్లు నిపిస్తుంది తనకి. తన ముద్దుల కూతురు తల్లి కోసం బెంగ పెట్టుకుంటుందనుకున్నప్పుడు బాధ కలుగుతుంది.

తన బాధకు కారణం ఎవరు? సరోజ కాదూ?

"ఉమా" పిలిచాడు మధుసూదనం.

"ఆఁ" ఉమ పలికింది లోపల్నించి. పలికిన ఆమె కంఠం వణికింది. మధుసూదనం ఆదుర్దాగా లోపలికి వచ్చాడు. ఉమ వో మూలగా గువ్వలా కూర్చుని వుంది. "ఏమిటమ్మాయ్?" ఉమ నవ్వింది. "చన్నీళ్ళు స్నానం చేసి వచ్చాను నాన్నా అందుకని చలి...."

"పిచ్చిపిల్లా" మధుసూదనం నవ్వుకున్నాడు. ఇప్పుడు తనూ స్నానం చేయాలి. ఎలా?

సరోజ అలవాటు యిది. అర్ధరాత్రియినా, పిడుగులతో వర్షం

పడుతున్నా సరే అందరూ స్నానం చేయాల్సిందే.

సీత వుంటే వేణ్ణీళ్ళు పెట్టేది అలవాటుగా. ఉమ, తనూ స్నానం చేసేవాళ్లు.

ఇవాళ సీత రాలేదు. అయినా, ఉమ అలవాటును మానలేక పోయింది. ఈ అలవాటు తల్లి నేర్పింది. అంటే ఉమ తల్లిని మర్చిపోలేదన్నమాట. మరి తను? తను సరోజను మర్చిపోగలడా? కుమార్ ముద్దు మాటల్ని మర్చిపోగలడా? కాని....కాని సరోజ మర్చిపోగలదు. మర్చిపోయింది కూడా.

"స్నానం చేసిరా నాన్నా" ఉమ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు మధుసూదనం. ఉమ పరికిణీ, జాకెట్టు తొడుక్కుని తల దువ్వు కుంటోంది. అద్దంలోనుంచి ఉమ మొహం కనిపించింది. గభాలున చూస్తే సరోజ మొహమేనేమోననిపిస్తుంది. సరోజ మొహం చూసి సరిగ్గా సంవత్సరమైంది. ఒక్కసారైనా చూసి వెళ్ళిందా? కనీసం ఓ వుత్తరం ముక్కైనా వ్రాసిందా? ఉహుఁ. పంతం. పంతం నెగ్గాలి. బ్రతుకులేమైతే తనకేం?

"స్నానానికి వెళ్ళలేదేం నాన్నా? నీకూ చలి వేస్తోందా?" ఉమ నవ్వింది.

"అబ్బే లేదమ్మా. నాకు చలేమిటి?" అంటూ పెరట్లోకి నడిచాడు మధుసూదనం.

వెన్నెల లేని చీకటి రేయి. చిక్కగా, నల్లగా, వుంది. ప్రక్క భాగంలోని రమణయ్య గారు అప్పుడే వచ్చారులావుంది, కారుని షెడ్‌లో పెడుతున్నారు.

మేడ పైభాగంలోని దంపతులు ఏవో కబుర్లు చెప్పుకుంటూ పకపక లాడుతున్నారు. ఆ వాతావరణం మధుసూదనం మనసులో

ముల్లులా గుచ్చుకుంది.

"నాన్నా" ఉమ పిల్చింది.

"ఏమ్మా"

"ఈ పూట కూడ గోపాలం చేత క్యారియర్ తెప్పించనా?"

క్షణం మౌనంగా వుండి అన్నాడు మధుసూదనం. "తప్పేదేముందమ్మా? తెప్పించు" ఒకరిమీద ఆధార పడితే జీవితం యింతే, అనుకున్నాడు మధుసూదనం. సీత రాకపోవటం వల్ల తమకెంత ఇబ్బంది కలిగించేరోజు? 'గోపాలం మంచివాడు కాబట్టి పొద్దున అడగంగానే క్యారియర్ తెచ్చిపెట్టి పుణ్యం కట్టుకున్నాడు. ఈ పూటకూడా తెచ్చిపెట్టక పోతాడా?' భవలుతో వాళ్ళు తుడుచుకుంటూ అనుకున్నాడు మధుసూదనం.

మధుసూదనానికి సరోజ గుర్తుకు వచ్చింది మళ్ళీ. గోపాలాన్ని గురించి అనుకున్నప్పుడల్లా సరోజ గుర్తు వస్తుంది. తనకు అప్పుడప్పుడు అనుమానం కలుగుతూ వుంటుంది - తనకంటే గోపాలం తెలివిగలవాడేమోనని. గోపాలం భార్య గవర్నమెంటు హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తోంది. గోపాలమే డి. యం. వో. కాళ్ళాపేళ్ళా పడి వుద్యోగ మిప్పించాడని, చాలామంది అనుకుంటారు. మరి తను? ఆ దృష్ట్యా గోపాలం తెలివిగలవాడా లేక ..........

"నాన్నా" ఉమ పిలుపు అతని ఆలోచనల్ని త్రెంచివేసింది.

ఉమ క్యారియెర్ తీసి రెండు పళ్ళేలలోను అన్నం వడ్డించింది. మధుసూదనం కూర్చున్నాడు. అన్నం అంతా మెదాపిండి ముద్దలా వుంది. కూరలు ఏ కూరలైనదీ చెప్పలేనంతగా రూపాన్ని, రుచిని పోగొట్టుకున్నై. మరి సంవత్సరం నుంచి తాము ఆరగిస్తున్న ఆహారం యిదే.

తన కిష్టమైన విధంగా వంట చేసి పక్కన కూర్చుని కొసరి కొసరి తినిపించే సరోజ రూపం అతని కళ్ళకు కట్టింది.............. హోటల్ మెతుకుల్ని తనే తినలేక పోతుంటే పాపం ఉమ ఎలా పొట్ట నింపుకుంటుందో.

ఉమ చెయ్యి కడుక్కుంది. మధుసూదనం మనసు చివుక్కుమంది.

"అప్పుడే చేయి కడుక్కున్నావేం? ఉమా!"

"సయించలేదు నాన్నా. స్కూల్లో యివాళ పిల్లలందరికి టీపార్టీ చేశారు."

మధుసూదనం కొంతవరకు మనసును కుదుట పర్చుకున్నాడు. తనుకూడా భోజనం ముగించుకొని లేస్తూ "ఏమిటి విశేషం స్కూల్లో" అడిగేడు.

ఉమ గిన్నెల్ని ఒకదానిమీద ఒకటి సర్దుతూ అంది "మా వెంకటరత్నం మేష్టారు లేరూ, ఆయన్ని గుంటూరు ట్రాన్స్‌ఫర్ చేసారు. అందుకని."

"చాలా మంచి వాడమ్మాయ్. ఎందుకు వేసారో - అంత దూరం?" కుతూహలాన్ని కనబరిచాడు మధుసూదనం.

"ఆయన భార్యకి వుద్యోగం వచ్చిందిట ఆ వూర్లో?"

ఉమ సమాధానానికి మధుసూదనం గతుక్కుమన్నాడు. పక్క మీద పడుకున్నాడే గాని మధుసూదనానికి నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలు, ఏవేవో స్మృతులు దోమల్లాగానే సవారి చేస్తున్నాయి.

కొంతమందికి యిష్టమైన పనులు మరి కొంతమందికి అయిష్టాన్ని కలిగిస్తై. ఎదుటి వారి పనులు మనకు అయిష్టంగా తోచినపుడు మన అయిష్టతను వ్యక్తంచేసి వారిని ఆ పనులు చేయ నివ్వం. కాని, అయిష్టతను వ్యక్తం చేయలేక పోయినా, లేక మన

మాటను వారు లెక్క చేయక పోయినా మనసుకు కష్టం తప్పదు. ఇరువురికీ సామరస్యం కుదరనప్పుడు సర్దుకుపోదామని అనుకోవటం లొంగిపోవడమేమోనని భావించినప్పుడు దారులు వేరుగాక తప్పదు.

"ఎల్లుండి నుంచి శలవులు నాన్నా!" ఉమ దుప్పటి కప్పుకుంటూ అంది. మధుసూదనం విన్నాడు. విని, ఓ క్షణం ఏమీ మాట్లాడ లేదు. ఉమ ఆ సంగతి ఎందుకు చెప్పిందో అతనికి అర్థమైంది. శలవుల్లోనైనా అమ్మ నొకసారి చూసిరావాలని ఆ పసిదాని ఆరాటం. అమ్మను చూడాలంటే శలవు రానక్కర్లేదని ఆ పసి హృదయానికి తెలీదు పాపం. శలవులు లేనందు వల్లనే కాదుగా సరోజ ఇక్కడకు రానిది. కాని...............

"నాన్నా"

"ఆఁ - విన్నానమ్మా"

ఉమ ఇక మాట్లాడలేదు. కొంచెంసేపు అటూ ఇటూ మసలి నిద్రపోయింది.

మధుసూదనం గంటసేపు ఆలోచించాడు. ఇలాంటి గంటలు యిదివరకెన్నో ఆలోచించాడు. సంవత్సరం నుంచీ ఆలోచిస్తూనే వున్నాడు. కాని, సమస్య తెగటం లేదు. తను ఏమీ చేయలేక పోతున్నాడు. ఒకసారి ఏర్పడిన భావనల్ని, వెలిబుచ్చిన అభిప్రాయాల్ని కాదని ఇప్పుడు రాజీ పడలేకపోతున్నాడు. కాలం తన కనుకూలంగా కలిసి రాకపోతుందా అనే ఆశాభావంతోనే ఇంత కాలం గడిపేడు.

"అమ్మా! అమ్మా!"

ఉమ కలవరించింది. అతని గుండెల మీద సమ్మెటతో కొట్టినట్లైంది. మధుసూదనం నిట్టూర్చాడు.

అతనికి తెలుసు. అది కలవరింతే అయినా, పసిహృదయం

నుంచీ పైకుబికిన ఆవేదన అని.

అతని మనస్సు ఉమను వదిలి నల్లభైమైళ్ళ ప్రయాణం చేసింది.

* * *

సరోజ యింటి కొచ్చేసరికి చాలా పొద్దుపోయింది. అలా పొద్దుపోయి ఇంటికి రావటం ఆమెకు బాగా అలవాటయింది. ఇటీవల రంగరాజమ్మ గారితో స్నేహం కలిసిన తర్వాతనే ఆమె యిలా ప్రొద్దు పోయి ఇంటికి రావడం.

రంగరాజమ్మగారు కలెక్టరుగారి సతీమణి. మహిళామండలి అధ్యక్షురాలు. మరి ఆవిడ కూర్చోబెట్టి మాట్లాడుతుంటే కాదని ఎలా రాగలదు సరోజ మాత్రం? అదీగాక ఆవిడ మాట్లాడుతుంటే సరోజకు హాయిగా, తీయగా జాతి సర్పానికి నాదస్వరం వూదినట్లుగా వుంటుంది. వాక్చాతుర్యంతోబాటు, మాట్లాడుతూనే ఎదుటి వారి హృదయాల్లోని నిగూఢమైన రహస్యాల్ని ఇట్టే చదివేయగల నేర్పు రంగరాజమ్మగారికి వుందని, సరోజకు తెలుసు.

రమణమ్మగారికి యివన్నీ తెలీవు. ఆమె తెలుసుకున్నదల్లా ఒక్కటే. వ్యర్థమైన కబుర్లతో కాలాన్ని వృథా చేస్తూ సరోజ ఆలస్యంగా యింటికి వస్తోందని.

సరోజ వచ్చీ రాగానే కుర్చీలో కూలబడి కణతల్ని చేతివ్రేళ్ళతో నొక్కుకుంటూ కూర్చోవటం గమనించింది రమణమ్మగారు.

"ఏమిటే అలా వున్నావ్? ఒంట్లో బాగా లేదా?" అడిగింది కూతురుకు దగ్గరగా వచ్చి.

సరోజ తల పైకెత్తి చూసింది "ఏమీ లేదమ్మా? తలనొప్పిగా వుంది అంతే."

రవణమ్మగారికి కూతుర్ని దెప్పటానికి అవకాశం దొరికింది. "గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే తలనొప్పేం ఖర్మ, కొంత కాలానికి పిచ్చి కూడా పడుతుంది" అంది. మరో సమయంలో అయితే తల్లితో వాదనకు దిగి, తనేమీ అనవసరమయిన కాలయాపన చేయడంలేదని ఆమెను నమ్మించేదే గాని, ఇప్పుడు అందుకు తలపడ దలచుకోలేదు సరోజ. శరీరమంతా చితకగొట్టినట్లు నొప్పులుగా వుంది. మనసుకు విసుగ్గా వుంది. తల్లికి సమాధానం చెప్పకుండానే మాట మారుస్తూ "కుమార్ నిద్రపోయాడా" అంది.

"నిద్రపోక ఎంతసేపని కూర్చుంటాడు వాడు మాత్రం. నీకోసం ఎదురు చూసి చూసి యిప్పుడే పడుకున్నాడు." అంది రవణమ్మగారు.

"ఆకలవుతోంది అన్నం పెట్టు. స్నానం చేసి వస్తాను." సరోజ లేచింది. "తలనొప్పిగా వుందంటూ ఇప్పుడు స్నానం చేయక పోతే ఏం?" తల్లి ప్రశ్నకు జవాబు చెప్పకుండానే సరోజ మౌనంగా బాత్‌రూమ్‌కేసి నడిచింది. "నా మాట ఎందుకు వింటావులే నువ్వు?" అంటూ వంట గదికి దారి తీసింది రవణమ్మగారు.

రవణమ్మగారు రెండు కంచాల్లోనూ అన్నం వడ్డించింది. అది చూసిన సరోజ మొదట ఆశ్చర్యపోయింది. ఆయనగారు లేరుగదా మరి, రెండో కంచం ఎవరికా? అనుకుంది. అంతలోనే తన ఆలోచనకు తనే నవ్వుకుంది. ఇలా పొద్దుపోయిన రోజు తనతోపాటు తల్లికూడా వడ్డించుకుంటుంది. సరోజకు భర్త జ్ఞాపకం వచ్చాడు. తామిద్దరూ ఆ విధంగా ఎదురెదురుగా కూర్చొని భోంచేసిన రోజులు జ్ఞప్తికి వచ్చాయి. "కూర్చోవేమే? నిల్చుని అలా చూస్తావేం?" అంది రవణమ్మగారు. ఒక కంచాన్ని ముందుకు లాక్కుంటూ, ఆలోచనల్ని విదిలించుకుంటూ కూర్చుంది సరోజ. "నువ్వింకా

అన్నం తినలేదూ ?" అని అడిగింది, తల్లి వైపు జాలిగా చూస్తూ. పాపం. ఆవిడ అసలే రోగిష్టి మనిషి. అప్పుడప్పుడు రక్తపోటు వస్తూ వుంటుంది. ఇంటెడు చాకిరీ మీద పడటంతో ఆవిడ మరీ నలిగినట్లు కనిపించింది సరోజకు. "కూతురుకి అన్నం పెట్టకుండా ఏ తల్లి అన్నం తింటుందే ?" అన్నది రవణమ్మగారు, సరోజ ముఖంలోకి చూస్తూ.

చెళ్ళున కొట్టి నట్లయింది సరోజకు. ఉమ గుర్తుకు వచ్చింది. ఎలా వుంటోందో, ఎలా చదువు కుంటోందో, తను దగ్గర లేకపోవడంవల్ల ఎన్ని యిబ్బందులు పడుతోందో ననిపించింది. అంతలోనే తల్లి మాటల్లోని వ్యంగ్యం స్ఫురించి అవమానంతో కుంచించుకుపోయింది. తలవంచుకుని అన్నం ముద్దను నోట్లో పెట్టుకుంది.

"నాకు తెలీక అడుగుతాను గానీ, ఎన్నాళ్ళీ పంతాలు ? ఊహ తెలుస్తున్న పిల్లల్ని చెరొకరు అట్టే పెట్టుకొని ఎవరి దారిన వాళ్ళు ఉద్యోగాలు చేసుకుంటూ, ఊళ్ళేలుకుంటే ఆ పిల్లల మనసులు విరిగి పోవుటే ?"

సరోజ తల్లి వైపు చూసింది కోపంగా. రవణమ్మగారు తల దించుకొని అన్నం కలుపుకుంటోంది. క్షణంసేపు ఇద్దరూ మాట్లాడ లేదు. సరోజకు అన్నం తినాలనిపించలేదు. కాని, తినకుండా లేచిపోతే తల్లి బాధ పడుతుంది. ఆమె కూడా తినకుండా లేస్తుంది.

"అయితే, కాపురం చేసుకోవటం కంటే నీకీ వుద్యోగం చేసుకోవటమే హాయిగా వుందా ?."

సరోజ యిక సహించలేక పోయింది. "నీకెన్ని సార్లు చెప్పేను, ఆ విషయాలన్నీ కదపవద్దని ? ఎవరి బాగోగులు

వాళ్ళు చూసుకోగలరు. నీవేం వుద్ధరించ నక్కర్లేదు." అని చేయి కడుక్కొని లేచి వెళ్ళింది.

"ఎవరి బాగోగులు వాళ్ళు చూసుకోడమే కాదు, మరొకరి బాగోగులు చూడవలసిన అవసరం కూడా మీకు వుంది. మనస్పర్థలతో మీ జీవితాల్ని మీరు పాడుచేసుకున్నా పిల్లల మనసుల్ని కలుషితం చేసి వాళ్ళ భవిష్యత్తు పాడుచేసే హక్కు మీకు లేదు." ఆవేశంగా అంటున్న రమణమ్మగారి మాటలు సరోజకు వినిపించక పోలేదు.

కళ్ళు మూసుకుని పడుకుంది సరోజ. ప్రపంచ మంతా స్వార్థంతో నిండినట్లు తోచింది ఆమెకు. ఆ స్వార్థంతో ప్రతి వ్యక్తి ఒకే కోణంలో నుంచీ చూడటం, ఆలోచించడం జరుగుతుంది. తాము మారకుండానే తమ కనువైన విధంగా మారమని ఇతరులను వత్తిడి చేస్తూ వుంటారు.

సరోజ అది సహించలేదు. అందుకే ప్రపంచ మంటే ఒక విధమైన అసహ్యం, కోపం ప్రబలి పోయాయి ఆమెలో. ఆ కోపాన్నీ, అసహ్యాన్నీ ప్రదర్శించే మార్గం తోచక పిచ్చెత్తినట్లు అనిపిస్తుందామెకు. కసి దీరేలా ఏడుద్దామనిపిస్తుంది. కాని, అది చేయలేక పోయేది. ఇప్పుడూ అదే అవస్థకు లోనైందామె. ప్రక్కకు తిరిగి పడుకొంది సరోజ. అవతల చిన్న మంచం మీద కుమార్ నిద్ర పోతున్నాడు. నిద్రలోనే నవ్వుతున్నాడు.

ఎందుకో మరి, వాడు నెలరోజుల నుంచి రోజూ అడుగుతున్నాడు "అమ్మా! నాన్నగారు ఎప్పుడు వస్తారే?, అక్కయ్య ఏం చేస్తుంటుం దిప్పుడు?, నాన్నగారు ఇహ రానే రారా?" అని. తనేం సమాధానం చెప్తుంది?

"అల్లుడికి యిష్టం లేనప్పుడు నీ వెందుకే వుద్యోగం

చేయడం?" అనే తల్లి ప్రశ్నకు తనేం సమాధానం చెప్తుంది..

తను ఎవరి ప్రశ్నకూ జవాబు చెప్పలేదు. చెప్పగలిగినా ఎందుకు చెప్పాలి? తను పుద్యోగం చేయడం ఆయన కెందు కిష్టం వుండక పోవాలి? అనే తన ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పారు. ఆడది అయినంత మాత్రంచేత వుద్యోగం చేయకూడదని ఎక్కడా లేదే? అదేం తప్పుడు పనీ, హీనమైన పనీ కాదే? డిగ్రీలు పుచ్చుకొని, వాటికి "ఫ్రేం" కట్టించి గోడకు తగిలించుకోడమేనా చదువుల సార్థక్యం?

"నీవూ వుద్యోగం చేస్తే, పిల్లల పోషణా, ఇంటి వ్యవహారాలు ఎవరు చూస్తారు?" తను వుద్యోగం చేయటానికి ఆయన అభ్యంతరం అదే, అయితే అందుకు తను సమాధానం కూడా చెప్పింది. "మా అమ్మ వున్నది. అందరికీ పెద్ద దిక్కుగా వుంటూ, అన్నీ సర్దుకు పోతూ వుంటుంది. ఒక్కరి సంపాదన మీదే అందరూ ఆధారపడి అన్ని అవసరాలను గడుపుకోలేక, అవసరానికి ఆదుకొనేందుకు పది కాసులు వెనుక వేసుకోలేక, చాలీచాలని ఇరుకు జీవితాలు గడిపేకంటే అవకాశంవున్నప్పుడు భార్యాభర్తలు యిద్దరూ వుద్యోగాలు చేసుకొంటే తప్పేముంది? కుటుంబ నిర్వహణకు నా వుద్యోగం ప్రతిబంధక మైనపుడు, దాన్ని తప్పకుండా రిజైన్ చేస్తాను" అని అన్నా, "నువ్వేమైనా చెప్పు నువ్వు వుద్యోగం చేయడం నా కిష్టం లేదు." అర్థం లేకుండా తగిన కారణం చూపకుండా చేయమన్న పనిని తను చేయలేదు. అసలా ఆలోచననే హర్షించదు. వుద్యోగంలో చేరటానికే నిర్ణయించుకుంది.

"ఇలా వెళ్ళవలసి వస్తుందని నేను ఊహించనైనా లేదు. అనుకోకుండా ఈ వూరు నుంచి ట్రాన్స్ఫర్ చేశారు. వెళ్ళక తప్పదు."

ఇవే ఆయన మాటలు ఆ రోజు. తను ఉద్యోగంలో చేరవలసింది ఆ రోజే. ఆయన మాటలు తనను ఎంతగానో శృంగదీశాయి. తనకు తెలుసు, ఆయన కావాలని బదిలీ చేయించుకున్నారని. తను ఆయన సలహాని పాటించి, వచ్చిన ఉద్యోగాన్ని తిరస్కరించనందుకు శిక్ష కాబోలు - ఆయన అలా బదిలీ చేయించుకు పారిపోవటం. పట్టుదలల్ని పెంచుకుంటూ, తమ పట్టు విడవని వాళ్ళంటే తనకు గిట్టదు. అందుకనే ఆ కోపంతోనే అనేసింది. "మీకు కోపం వచ్చి వెళ్ళినా సరే - నేను వుద్యోగంలో చేరకమానను. మా అమ్మ కష్టపడి చదివించిన చదువు తెచ్చిపెట్టిన వుద్యోగం యిది" అని.

ఒకరి సమాచారాన్ని మరొకరికి అందచేస్తూ దేశాని కంతటికీ వెన్నెముకలాంటి డిపార్టుమెంటులో వుద్యోగం దొరికినందుకు తనకు చాలా ఆనందం కలిగింది. అయితే తన ఆనందాన్ని పంచుకోటానికి భర్త చేరువలో లేనందుకు విచారమూ కలిగింది. ఉత్తరం ద్వారానైనా తన ఆనందాన్ని పంచుకోవాలనుకొని వ్రాసింది. కాని, దానికి సమాధానం రాస్తారో లేదో, సమాధానం రాయకపోతే తన అభిమానం ఎంత దెబ్బ తింటుంది? అది తను సహించలేదు. అందుకే ఉత్తరాన్ని పోస్టు చేయలేదు.

సరోజ లేచి టైం చూసింది. పదిన్నర దాటింది. ఈ రోజెందుకో మనసు గతాన్ని పునశ్చరణ చేసుకుంటోంది. అందుకు మనుషులు కూడా దోహదం చేస్తున్నారు. రంగరాజమ్మగారు అడిగిన ప్రశ్న చెవుల్లో గింగురుమంటోంది. జవాబుగా తను చెప్పిన కథంతా విని, విషాదంగా నవ్వింది ఆవిడ.

"చాలా విచారకరంగా వుంది సరోజా! ఈ రోజుల్లో కూడా ఇంకా అలాంటి వారున్నారంటే, అది మన దురదృష్టమే అనుకోవాలి.

కాని, మనం లొంగి పోకూడదు. మన ప్రయత్నం మనం చేయాలి. తప్పదు. పెద్దలకోసం కాకపోయినా, పసికందుల కోసమైనా తప్పదు. త్వరలోనే విభేదాల్ని మరచి మీ దంపతులు నాకు విందు చేయాలి" అని నవ్వుతూ భుజం తట్టింది.

సరోజకు మనసంతా చికాకైపోయింది. ఏదో వెలితి తన నిత్య జీవితంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఆ వెలితిని పోగొట్టుకోవాలి. కాని, మార్గం ఏమిటి? తను వుద్యోగం మాత్రం వదులుకో కూడదు ఇప్పట్లో.

ఆలోచనలతోనే తెల్లవారింది సరోజకు.

* * *

"ఉమా! నే వెళ్తున్నానమ్మా! కొత్త వూరు, కొత్తచోటు అని భయపడకు."

"నాకేం భయం లేదు. నువ్వు వెళ్ళిరా నాన్నా!" ఉమ నవ్వు తెచ్చుకుంటూ అంది.

ఉమ లేత పెదవుల మీద వెలిగిన చిరునవ్వు సగం ధైర్యాన్నిచ్చింది మధుసూదనానికి. ఆఫీసుకు బయల్దేరాడు.

మలుపు తిరగ్గానే కనిపించిన మనిషి - అతని అడుగుని ముందుకు వేయనివ్వలేదు. మధుసూదనం నోట మాట రాక అలాగే నిలబడిపోతే, నిలువెత్తు మనిషిని పూర్తిగా తడిపింది - చెమట.

సరోజ! తన భార్య!! ఉమ తల్లి!!!

మధుసూదనాన్ని చూసిన సరోజ కూడా అలాగే అయిపోయింది. "ఈ వూరు ఎప్పుడొచ్చావ్ - నువ్వు?" "మీరు.... ఇక్కడ?...." ఇద్దరి ప్రశ్నలు ఢీకొన్నై. రెండు సంవత్సరంపాటు ఎడబాటును సహించిన దంపతులు! అంతకంటే ఎక్కువ మాట్లాడుకోలేక

పోయారు. నాలుగు కళ్ళూ కలిసి హృదయాల్లోని భావాలకు నానార్థాలు చెప్పుకున్నై.

మధుసూదనంకి కుమార్ గుర్తుకు వచ్చాడు.

సరోజ కళ్ల ముందు ఉమ మెదిలింది.

"ఆఫీసుకు వేళయింది" మధుసూదనం కదలబోయాడు.

"నేనూ ఈ రోజే జాయిన్ కావాలి. అనుకోకుండా యిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు."

మధుసూదనం ఆశ్చర్యంతో చూశాడు. ఇటు తనకు, అటు సరోజకు ఉన్న వూరు నుంచి యిక్కడికి ఒక్కసారి ట్రాన్స్‌ఫర్ కావడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అంతా గందరగోళంగా వుంది నాకు. సరేపద." అని కదల బోతున్న మధుసూదనంతో "సాయంత్రం ఇక్కడే కనిపించండి ఐదింటికి. ఇంటికి వెళ్దాం." అంది సరోజ.

రెండడుగులు నడచి వెనక్కి చూసిన మధుసూదనానికి ఆమె కళ్ళల్లో ఇంద్రధనుస్సు కనిపించింది.

* * *

అదే రోజు సాయంత్రం —

మహిళా మండలికి బయల్దేరబోతున్న రంగరాజమ్మగారికి సరోజ గుర్తుకొచ్చింది. ఆ వెంటనే వెన్నెలా - సన్నజాజులూ తలపు కొచ్చినై! సన్నగా నవ్వుకుంటూ కారెక్కింది!!